
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్థం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్థంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్థం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్థిక్కూడా సులభంగా అర్థం అవుతాయి. ఆయనది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

★★★★★

# 8 వ భాగం

## అంబరీషోపాఖ్యానం - 3

విష్ణుచక్రం తరుముతూంటే దూర్వాసుడు బ్రహ్మదేవుడి దగ్గిరకెళ్ళాడనీ అక్కడ పని అవ్వకపోతే కైలాసానికి పరుగెట్టాడనీ క్రితం వ్యాసంలో చదువుకున్నాం. ఇప్పుడు నీలకంఠుడు చెప్తున్నాడు దూర్వాసుడితో.

సీ. వినవయ్య! తండ్రి! ఈ విశ్వేశ్వరుని యందుఁ
జతురాస్య జీవకోశములు పెక్కు
వేల సంఖ్యలు గూడి వేళతో నిబ్బంగి
నగుచుండుఁ జనుచుండు; నదియుఁగాక
యె వ్వానిచే భ్రాంతి నేమందుచున్నార
మేను దేవలుఁ దసురేంద్ర సుతుఁడు,
నారదుఁ డజుఁడు సనత్కుమారుఁడు ధర్మ్ముఁ
డా కపిలుఁడు మరీచ్యాదు లన్య [9-113]

ఆ. పారవిదులు సిద్ధపతులు నెవ్వని మాయ
నెఱుఁగలేము దాన నింత పడుదు
మట్టి నిఖిలనాథు నాయుధశ్రేష్ఠంబుఁ
దొలఁగఁ జేయ మాకు దుర్లభంబు. [9-113.1]

బ్రహ్మ కాస్త లౌక్యంగా చెప్తే శివుడు ఇంకా నెమ్మదిగా చెప్తున్నాడు, "తండ్రీ విను. ఈ సృష్టి అంతా ఆయనది. ఈ చతురాస్య కోటిలో జంతుజాలాలన్నీ ఎవరి మాయలో పుడుతూ గిడుతూ ఉన్నాయో అలాంటి వాడి భ్రాంతిలో మేమందరం ఉన్నాం. ఇంతమందిలో ఏ ఒక్కరూ కూడా విష్ణువు మాయ కనుక్కోలేకుండా ఉన్నారు. అటువంటివాడి చక్రాయుధాన్నా ఆపమంటున్నావు? నేను చేయలేని దుర్లభమైన పని అది. ఆయన దగ్గిరకే పో" అన్నాడు.

ఈ సరికి దూర్వాసుడికి తపశ్శక్తి పుర్తిగా నాశనం అయిపోయింది. అహంకారం తొంభైతొమ్మిది పాళ్ళు పోయింది. చక్రం దుర్వక్రం అన్నది సుస్పష్టమైంది. కాళ్ళీడ్చుకుంటూ వైకుంఠానికి బయల్దేరేడు. భగవంతుడి మొహంలో నవ్వు అనేక మాయా విశేషాలకీ కారణంట. ఆయన అలా మనోహరంగా నవ్వుతూ ఉంటాడు మనల్ని చూసి, మనకున్న అహంకారం చూసీను. ఆ నవ్వు పొగరుగా కనబడితే ఆ తప్పు

మనదే ఎందుకంటే మనకి ఏది బయట కనబడుతుందో అది మనసులో ఉన్నదానికి ప్రతిరూపమే కదా? అంటే మనలో ఉన్న అహంకారం ఆయన మొహంలో చూస్తున్నాం. అదే నవ్వు మన అహంకారం అంతరించిపోతే అతి మనోహరంగా నయనానందకరంగా కనబడుతుంది. మాయా విశేషాలంటే ఇవే. ఇప్పుడు విష్ణువు చెప్తున్నాడు దూర్వాసుడితో.

చ. చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలి కొనిపోవుచుండుదు రకిల్బిషభక్తిలతాచయంబులన్
నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్;
వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతం జనకుందుఁ దాపస! [9–118]

దూర్వాసుడు వెళ్ళే సరికి జరిగేదంతా చూస్తున్న లీలా మానుషవిగ్రహుడికి నవ్వురాదూ మరి? ఇప్పుడు ఏదైనా మిగిలున్న అహంకారం అణచాలి. పోతన రాసిన ఈ పద్యం మొత్తం అంబరీషోపాఖ్యానం అంతటిలోనూ గొప్పది అని చెప్పవచ్చు.

మంచి బుద్ధిమంతులైన వారు, భగవంతుడొక్కడే సత్యం అని తెలుసుకున్న సాధువులు నన్ను మనసులో తల్చుకుంటూ నా హృదయాన్ని తీసుకుపోయి మదించిన ఏనుగుని కట్టే విధంగా వాళ్ళ భక్తితో నన్ను కట్టేస్తారు అచంచలమైన భక్తితో. ఆ వలలో పడి నేను తప్పించుకోలేను. అందుచేత వాళ్లవెంబడే వెళ్తూ ఉంటాను.

ఆ. నాకు మేలు గోరు నా భక్తుఁ డగువాఁడు
భక్తజనుల కేన పరమగతియు;
భక్తుఁడెందు జనినఁ బఱతెంతు వెనువెంట
గోవు వెంటఁ దగులు కోడె భంగి. [9–119]

అటువంటి భక్తుడుంటాడే, వారికూడా ఉంటూ, వారి వెంటే నేను, వాళ్ళెక్కడికి వెళ్తే అలా వెళ్తూ ఊంటాను. ఎందుకంటే ప్రపంచంలో అన్నింటినీ త్యజించి నన్నే నమ్ముకున్నాడు మరి.

ఆ. తనువు మనువు విడిచి, తనయులఁ జుట్టాల
నాలి విడిచి, సంపదాలి విడిచి,
నన్నకాని యన్య మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్టివారి నైన. [9–121]

శరీరం, మనస్సు, చుట్టాలు, ఆలి వీళ్ళందర్నీ విడిచి నన్ను నమ్ముకున్నవాళ్ళకి నేనే కదా రక్ష? అటువంటివాళ్ళని ఎప్పటికీ విడవను, వాళ్ళు ఎటువంటివారేనా సరే.

క. సాధుల హృదయము నాయది;
సాధుల హృదయంబు నేను; జగముల నెల్లన్
సాధుల నేన యెఱుంగుదు
సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా! [9–123]

సాధువుల హృదయంలో నేను ఉంటాను. వాళ్ళు నా హృదయంలో ఉంటారు.వాళ్ళకి నేను తెలుసు, నాకు వాళ్ళు తెలుసు. అదీగాక నేను చక్రాన్ని అంబరీషుడికిచ్చేను. వెళ్ళు, వెళ్ళి అంబరీషుణ్ణే శరుణువేడు అన్నాడు.

ముందే విష్ణువు దగ్గిరకి వెళ్తే బావుండేది కదా? అలా వెళ్లం. ఎందుకంటే అహంకారం అలాగే మనల్ని శాసిస్తూ ఉంటుంది. అది పోగానే అహం బ్రహ్మాస్మి. తపశ్శక్తిదేముంది? పోతే సంపాదించుకోవచ్చు మళ్ళీ. మరి అహంకారమో? అది పూర్తిగా నాశనం కావడానికి కోటానుకోట్ల జన్మలు ఎత్తాల్సిరావొచ్చు. అందుకే విష్ణువు దూర్వాసుడ్ని మళ్ళీ అంబరీషుడి దగ్గిరకి వెళ్లమన్నది. ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల్లో ఏ ఒకరైనా చక్రాన్నుంచి దూర్వాసుడ్ని కాపాడాగలరు కానీ అహంకారం పోగొట్టలేరు. ఎందుకంటే అది మనచేతిలో పని. నా భక్తుడ్ని ఇన్ని కష్టాలు పెట్టేడు వీణ్ణి చంపేసి రా అనలేదు చక్రంతో చూసారా?ఎందుకంటే దూర్వాసుడు కూడా భక్తుడే.

ఇప్పుడు దూర్వాసుడు మళ్ళీ అంబరీషుడి దగ్గిరకే బయల్దేరేడు. వెన్నకి వచ్చాక 'నాయనా నువ్వింత భక్తుడవని నాకు తెలియదు. కోపంలో కళ్ళు కనిపించక ఇలా అన్నాను నిన్ను. నన్ను ఈ చక్రం నుంచి రక్షించే భారం నీదే' అని కాళ్ళ మీద పడ్డాడు.

అంబరీషుడు ఎంత గొప్పవాడంటే ఈ చక్రం నాకు విష్ణువిచ్చేడు, నా ఇష్టానుసారం అది నాదగ్గిర ఉంటుంది, పోతుంది అనుకోలేదు.

సీ. నీవ పావకుఁడవు; నీవ సూర్యుండవు;
నీవ చంద్రుండవు; నీవ జలము;
నీవ నేలయు; నింగి నీవ; సమీరంబు
నీవ; భూతేంద్రియ నికర మీవ;
నీవ బ్రహ్మంబును; నీవ సత్యంబును;
నీవ యజ్ఞంబును; నీవ ఫలము;
నీవ లోకేశులు; నీవ సర్వాత్మయు;
నీవ కాలంబును; నీవ జగము; [9-129]

తే. నీవ బహుయజ్ఞభోజివి; నీవ నిత్య
మూలతేజంబు; నీకు నే మ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించు నట్టి
శస్త్రముఖ్యమ! కావవే చాలు మునిని. [9-129-1]

ఈ చక్రపురుషుణ్ణి కీర్తిస్తూ "మహానుభావా మీనుంచి ఈ ముని అనేక కష్టాలు పడ్డాడు పాపం. తప్పు ఎవరిదైతే ఇప్పుడెందుకు, ఆయన తపశ్శక్తి అంతా పోయింది, ఇప్పుడు కాస్త శాంతించండి" అన్నాడు.

అని ఈ చక్రం ఇంకా శాంతించదేమో అని మళ్ళీ ఇలా అంటున్నాడు. తను చేసుకున్న పుణ్యం, పాలించే ధర్మం పణంగా పెట్టి మరీ అడుగుతున్నాడు చక్రాన్ని.

ఆ. విహిత ధర్మమందు విహరింతు నేనియు
నిష్టమైన ద్రవ్యమిత్తునేని
ధరణిసురుఁడు మాకు దైవతం బగునేని
విప్రునకు శుభంబు వెలయుఁగాక. [9-137]

నేను కనక ధర్మం తప్పని వాణ్ణైతే, అడిగిన అందరికీ అన్నీ ఇచ్చేవాణ్ణైతే, అదీగాక ఈ ముని మాకు పూజ్యుడైతే ఆయనకి మంచి జరగాలి. ఇంతవరకూ వచ్చినా అంబరీషుడు ఒక్కసారి కూడా దూర్వాసుడ్ని ఒక్క మాట అనలేదు. అదే అహంకారం పోవడం అంటే. ఇప్పటికీ కూడా ముని మాకు పూజ్యుడైతే అంటున్నాడు. అప్పుడు చక్రం శాంతించి వెనక్కి వెళ్ళిపోయింది. అప్పుడు అంబరీషుడు మునికి మళ్ళీ దగ్గిరుండి అన్ని ఉపచారాలూ చేసి భోజనం పెట్టించి పంపించేడు. వెళ్తూ దూర్వాసుడంటాడు కదా.

మ. నరనాథోత్తమ! మేలు చేసితి కదా! నా తప్పు మన్నించి శ్రీ
హరి పాదాబ్జము లింత ముట్టఁగొలుతే? యాశ్చర్యమౌనెన్నుచో
నరుదంద్రే నినుబోఁటి సాధునకుఁ దానై యిచ్చుటల్ గాచుటల్
సొరిదిన్ నైజగుణంబులై సరస వచ్చుం గాదె మిత్రాకృతిన్. [9-140]

నాకింత మేలు చేసావు నీ మీద కోపం ప్రదర్శించినా సరే. ఇంత అపూర్వంగా నువ్వు విష్ణు పాదాబ్జాలని సేవించావు. ఇలా దానాలివ్వడం, మిత్రునిలా ఆదరించడం నీకు సహజ గుణాలే.

శా. కంటిన్ నేఁటికి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయిం బ్రీతిగా
వింటి న్నన్నముఁ గొంటి నీ గృహమునన్ వేడ్కన్ ఫలం బందె నే
మంటిం బోయెద; నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁగల రీమీఁదన్ నరేంద్రాగ్రణీ!" [9-146]

ఇంతటి విష్ణు భక్తుడివైన నిన్ను చూసాను. నీ ఇంట్లో భోజనం చేశాను. నిన్ను దేవతలూ మనుషులూ కూడా విష్ణు భక్తుడవని కీర్తిస్తారు. అని వెళ్ళేడు తన నివాసానికి.

ఇప్పుడు మళ్ళీ ఇంకోసారి చూద్దాం మహావిష్ణువు అంబరీషుడికి చక్రం ఎందుకు రక్షగా ఇచ్చాడో. భూత భవిష్యత్ వర్తమానాల్లో ఎప్పుడు ఎక్కడ ఏమి ఎందుకు జరుగుతోందో తెల్సినవాడు భగవంతుడు అని చెప్పుకున్నాం కదా? రాబోయే రోజుల్లో ఇలా దూర్వాసుడొస్తాడనీ, వచ్చిన మునికి అహంకారం అణచాలనీ అదే సమయంలో అంబరీషుణ్ణి రక్షించాలనీ ముందే తెలుసు ఆయనకి. ఇందులో కూడా ముందు భక్త పాలన కళాసంరంభనే ముందు, ఆ తర్వాతే దానవోద్రేక స్థంభన. అందుకే పోతన భాగవతం తెనిగిస్తూ మొదట్లో రాసిన 'శ్రీ కైవల్యపదంబు చేరుటకు నై చింతించెదన్..' అనేది మొత్తం భాగవతానికి మకుటాయమానమైన పద్యం.

అసలు దూర్వాసుడు అంబరీషుణ్ణి పది జన్మలు చేపగా, పందిగా... ఎత్తమని శపించాడనీ, భక్తుణ్ణి రక్షించడం కోసం అంబరీషుడి బదులు విష్ణువే ఆ పది జన్మలూ దశావతారాల్లోఎత్తాడనీ ఇంకో రకం కథ ఉంది ప్రచారంలో. ఏదైతేనేం, మొత్తానికి కథ మాత్రం చూచాయగా ఇదే.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS